నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I హైదరాబాద్, శనివారం 1 మార్చి 2025 | HYDERABAD


## • భారమైన కన్నతల్లి..



మన్సూరాబాద్, ఫిబ్రవరి 28: నవమాసాలు మోసి..కని పెంచిన తల్లి..కుమారుడికి భారంగా మారింది. కనికరం లేకుండా ఆమెను రోడ్డునపడేశాడు. సంస్థాన్ నారాయణపురం మండలం సీత్యాతండాకు చెందిన ధర్మీ (80)కి ముగ్గురు కుమారులు, కుమార్తె. ఇద్దరు కుమారులు చనిపోగా, చిన్న కుమారుడైన లక్ష్మా నాయక్‌తో కలిసి ఎల్బీనగర్ ప్రాంతంలో నివాసముంటున్నది. వృద్ధాప్యంలో ఉన్న తల్లి ఆలనాపాలన చూసుకోవాల్సిన కొడుకు లక్ష్మానాయక్..తల్లిని భారంగా భావించాడు. గురువారం సాయంత్రం ఆమెను ఆటోలో తీసుకొచ్చి మనస్సూరాబాద్, చిత్ర సీమ కాలనీలోని లిటిల్ చాంప్స్ స్కూల్ సమీపంలో వదిలి వెళ్లాడు. దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ రోడ్డు పక్కన ఉన్న ధర్మీని కాలనీవాసులు చేరదీశారు. ఆమె దీన స్థితిని చూసి చలించి.. అన్న పానీయాలు అందించారు. వనస్థలిపురం పోలీసులు.. వృద్ధురాలిని అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలోని ఆలేటి అనాథ వృద్ధాశ్రమానికి తరలించారు.

## బోరబండ సీఐపై బదిలీ వేటు!

డీఐని కూడా బదిలీ చేసిన సీపీ

సిటీబ్యూరో/ఎర్రగడ: బోరబండ సీఐ వీరశంకర్ వ్యవహారశైలిపై సీపీ సీవీ ఆనంద్ సీరియస్ అయ్యారు. సీఐ వీరశంకర్‌తో పాటు డీఐ భూపాల్ గౌడ్‌లపై బదిలీ వేటు వేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ శుక్రవారం సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ వీరశంకర్ ప్రవర్తన బాగాలేకపోవడంతో పాటు పలు ఆర్థిక అంశాలలో నేరుగా ప్రమేయం ఉండటంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. ఇదే సమయంలో నమస్తే తెలంగాణ సీఐ వీరశంకర్ వ్యవహారశైలిపై కథనాలు ప్రచురించింది. ఏసీపీ వ్యక్తిగత విచారణ చేపట్టారు. స్టేషన్‌లో జరిగిన వ్యవహారాలపై కానిస్టేబుళ్లను ఆరా తీయడంతో పాటు కొందరు ఫిర్యాదుదారుల స్టేట్‌మెంట్స్ కూడా రికార్డు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో సీపీ సీఐపై బదిలీ వేటు వేశారు. అలాగే ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను కూడా బదిలీ చేశారు. వీరశంకర్‌ను చార్మినార్ ట్రాఫిక్ సీఐగా, మల్కాపురం సురేందర్‌ను బోరబండ సీఐగా నియమించారు. మరోవైపు బోరబండ డీఐ భూపాల్ గౌడ్‌ను చాదర్‌ఘాట్ డీఐగా, అక్కడ పనిచేస్తున్న సైదులును బోరబండ డీఐగా నియమించారు.

# పేదల సొంతింటి కలకు ఎమ్మెల్యే మోకాలడ్డు

గుడిసెల స్థానంలో గత ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్రూం

ఇండ్లను పంపిణీ చేయకుండా అడ్డుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

సిటీబ్యూరో: ఓల్డ్ మారేడ్‌పల్లి బస్తీవాసుల సొంతింటి కలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తమ సొంత స్థలంలో కట్టించిన డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయకుండా అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. ఓల్డ్ మారేడ్‌పల్లిలోని బస్తీలో గుడిసెలు, ఇరుకు గదుల్లో ఉంటున్న పేదలకు అప్పటి ఎమ్మెల్యే సాయన్న, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చొరవతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022లో డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. మొత్తం 468 ఇండ్లను నిర్మించగా, మొదటి విడతలో 256 మందికి పట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన 212 మందికి నిర్మాణం పూర్తయిన వెంటనే రెండో విడతలో అందజేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఆ తర్వాత శాసనసభ ఎన్నికల కోడ్ రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇండ్లను పక్కకు పెట్టారు. ఉప ఎన్నికల్లో గెలిచిన శ్రీగణేశ్ వెంటనే పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల జాబితాను మార్చేందుకు ఎమ్మెల్యే శ్రీగణేశ్ కుట్ర చేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మా ఇండ్లు మాకే ఇవ్వాలి



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏడాది నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా మాకు ఇండ్లు ఇవ్వడంలేదు. ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడంలేదు.

**- టీ ఉమాశంకర్, ఓల్డ్ మారేడ్‌పల్లి**

### అధికారుల చుట్టూ..తిరుగుతున్నాం



ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఇండ్ల పట్టాలు పంపిణీ చేయడంలేదు. మా స్థలంలో కట్టిన ఇండ్లు మాకు ఇవ్వడానికి ఇంత ఆలస్యం చేయడమెందుకు?. ఇప్పటికే రెండో లిస్ట్‌లో మా అందరి పేర్లు వచ్చాయి. దాన్ని ఎమ్మార్వో నుంచి ఆర్డీవో దాకా అందరూ అంగీకరిస్తూ సంతకాలు చేశారు. అయినా పట్టాల పంపిణీ అపడానికి కారణమేంటో తెలియడం లేదు.

**-ఎస్.రాజగోపాల్, ఓల్డ్ మారేడ్‌పల్లి**







తాగునీటికి కటకట..మియాపూర్ హైదరాబాద్ మెట్రో కార్యాలయం వద్ద బారులు తీరిన వాటర్ ట్యాంకర్లు

# బకాయి ఉంటే ప్రాపర్టీ సీజ్!

ఆస్తిపన్ను బకాయిదారులపై జీహెచ్‌ఎంసీ స్పెషల్ డ్రైవ్

ప్రతి సర్కిల్‌లో రోజుకు ఐదు ప్రాపర్టీలను సీజ్ చేస్తున్న అధికారులు

ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా చర్యలు

ఒక్క రోజే రూ. 20కోట్ల ఆదాయాన్ని రాబట్టుకున్నవైనం

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఆస్తిపన్ను బకాయిదారులపై జీహెచ్‌ఎంసీ అధికారుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్నది. ప్రతి జోన్‌లో టాప్ 100 బకాయిదారుల జాబితాను సిద్ధం చేసుకొని నోటీసులకు స్పందించని సంబంధిత యజమానులకు సంబంధించి మొత్తం ఐదు చోట్ల ప్రాపర్టీలను స్వాధీనం చేసుకుంటూ వస్తున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటి వరకు 70 ప్రాపర్టీలను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా స్పెషల్ డ్రైవ్‌తో బకాయిదారులు ముందుకు వచ్చి చెల్లింపులు జరుపుతున్నారు. శుక్రవారం ఒక్క రోజూ 4వేల మంది నుంచి రూ.20 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవడం గమనార్హం. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం రూ.2100కోట్ల నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు కేవలం రూ.1520కోట్ల మేర పన్ను వసూళ్లు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.

### ప్రభుత్వ రంగ సంస్థలకు నోటీసులు

ఆస్తిపన్ను రూపంలో మొండి బకాయిలు మొత్తం దాదాపుగా రూ. 9800కోట్ల మేర రావాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలదే కీలకం. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన 600 ప్రాపర్టీల నుంచి రూ. 500 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు 4వేల ప్రాపర్టీల నుంచి రూ. 5000 కోట్ల బకాయిలు జీహెచ్‌ఎంసీ ఖజానాను చేరాల్సి ఉంది. అయితే ప్రజల విషయంలో ప్రాపర్టీల సీజ్ వరకు వెళ్తున్న అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బకాయిల రాబడిలో మాత్రం తూతూ మంత్రంగా నోటీసులతో సరిపెడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

# గడువులోగా ఖాళీ చేయండి.. లేకుంటే తొలగిస్తాం!

- చెరువుల వద్ద నిర్మాణాలపై హైడ్రా హెచ్చరిక
- ఆరు చెరువుల క్షేత్రస్థాయి పరిశీలన
- చెరువుల పునరుద్ధరణపై హైడ్రా బృందం




నల్లచెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో: తాము ఇచ్చిన గడువులోగా ఇళ్లు, స్థలాలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లేకుంటే హైడ్రా ఆయా నిర్మాణాలు కూల్చివేయకతప్పదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సున్నంచెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, బుమ్రుఖుద్దీన్‌దౌలా చెరువుల పునరద్ధరణ పనులను కమిషనర్ రంగనాథ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. విమోస్ టెక్నోక్రాట్స్ రూపొందించిన డీపీఆర్, కాన్సెప్ట్‌లను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సున్నంచెరువు వద్ద స్థానికులు ఉంటున్న నివాసాల వద్దకు వచ్చిన రంగనాథ్ అక్కడ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవద్దని, ఇవన్నీ అక్రమ నిర్మాణాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చ్ 8 లోగా అందరూ ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లేకుంటే తామే వచ్చి అన్నింటిని తొలగిస్తామని హెచ్చరించారు. స్థానికులు ఆయనతో మాట్లాడే ప్రయత్నం చేసినా వారి మాటలను వినలేదు. చెరువులో పూడికతీత తీసేందుకు అందులోని నీటిని తొలగించేందుకు బ్రిడ్జి కింది భాగాన్ని కూల్చి నీళ్లు పోయేలా చేశారు. అనంతరం కూకట్‌పల్లి నల్లచెరువును రంగనాథ్ బృందం సందర్శించింది. అక్కడ బఫర్ జోన్ లో పట్టా భూములు కలిగిన వ్యక్తులతో చర్చించారు. నల్లచెరువును సుందరీకరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ,చెరువులో పట్టా భూములు కలిగిన వారికి ప్రభుత్వం నుంచి టీడీఆర్ లేదా నష్టపరిహారం రూపంలో అందుతుందని రంగనాథ్ తెలిపారు. ఆ తర్వాత తమ్మిడికుంట, ఉప్పల్ నల్లచెరువు, బుమ్రుఖుద్దీన్‌దౌలా చెరువులను సందర్శించి అక్కడ పరిస్థితులపై స్థానిక అధికారులతో చర్చించారు. చెరువుల బఫర్ జోన్లలో ఇంటిస్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ కింద సాయం చేస్తామని, ఇప్పటికే నివాసమున్న ఇళ్లను కూలగొట్టమని చెప్పారు. చెరువుల పరిరక్షణ, సుందరీకరణ, పునరుద్ధరణ పనుల్లో ఎక్కడా నివాసాలు తొలగించబోమని రంగనాథ్ స్పష్టం చేశారు. సుమారు రూ. 58.50 కోట్లతో ఈ ఐదు చెరువులతో పాటు బతుకమ్మకుంటను మొదటి విడతగా అభివృద్ధి చేస్తున్నామని రంగనాథ్ తెలిపారు. ప్రస్తుతం ఈ చెరువుల్లోకి డివాటరింగ్ పనులను చేపట్టామని, ముందుగా చెరువులో ఉన్న వ్యర్థాలను బయటకు పంపి డ్రై చేసి ఆ తర్వాత పునరుద్ధరణ చేపడుతామని ఆయన చెప్పారు. ఇప్పటికే ఆరు చెరువుల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు.



## ఇంకా టీయాప్ ఫోలియో పేరే

పిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ఆర్టీఏ కార్యాలయాల్లో దళారుల బెడద లేకుండా. వాహనదారులకు పారదర్శకమైన సేవలందించేందుకు కేసీఆర్ పాలనలో తీసుకొచ్చిన 'టీ యాప్ ఫోలియో' యాప్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. టీ యాప్ ఫోలియోను రద్దు చేసి ఇప్పటి వరకు యాప్ ద్వారా అందుతున్న సేవలను 'మీసేవ' యాప్‌లోకి మార్చారు. అందులో రిజిస్ట్రేషన్లు, అప్లికేషన్ అండ్ సర్టిఫికేషన్స్ సేవలతో పాటు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ సేవలను చేర్చారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీఏ సేవలను ఆన్‌లైన్‌లో ఒకే చోట అందించిన రవాణా శాఖ తాజాగా 'మీసేవ' యాప్‌లోకి టీయాప్ ఫోలియో సేవలను బదలాయించారు. అయితే వాహనదారులు ఆర్టీఏ వెబ్ సైట్‌లోకి వెళితే అందులో ఇంకా టీయాప్ ఫోలియో సేవలనే వినియోగించుకోండని సూచించడం విశేషం. కానీ ఆ యాప్‌ను ప్రస్తుతం ప్లేస్టోర్‌లో అన్వేషిస్తే మాత్రం కనిపించడం లేదు. దీంతో వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. ఆర్టీఏ అధికారులు 'మీసేవ' యాప్‌లో ఆర్టీఏ సేవలు అందుబాటులో ఉన్నాయనే విషయంపై వాహనదారులకు అవగాహన కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కేపీహెచ్‌బీకాలనీలోని పార్కుల్లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## పార్కులో వాకింగ్ చేస్తే.. ఫీజులా?

బల్దియా అధికారులపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 28 : జీహెచ్‌ఎంసీ అభివృద్ధి చేసిన పార్కులలో ప్రజలు వాకింగ్ చేయడానికి డబ్బులు వసూలు చేయడం బాధాకరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ లోని పార్కులను ఎమ్మెల్యే కృష్ణారావు కార్పొరేటర్ శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కేపీహెచ్‌బీ కాలనీలోని మలేషియన్ టౌన్ షిప్ పక్కన 5 ఎకరాల ఖాళీ స్థలాన్ని పార్కుగా, క్రీడా ప్రాంగణంగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసిన పార్కులో ప్రజలు వాకింగ్ చేయడానికి బల్దియా అధికారులు డబ్బులు వసూలు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా పార్కుల అభివృద్ధి కోసం ఒక రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. పార్కులను అభివృద్ధి చేయకపోగా.. గతంలో అభివృద్ధి చేసిన పార్కులలో ఫీజులు పెట్టి ప్రజల వద్ద డబ్బులు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ శంకర్, జలమండలి మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఉద్యానవన విభాగ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే ఎఫెక్ట్

## ఆ ఉద్యోగులపై చర్యలు

సిటీబ్యూరో: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ బి. రమేశ్‌తో పాటు మరో సూపర్‌వైజర్‌పై వేటు వేయాలని బల్దియా నిర్ణయించింది. ఈ మేరకు అదనపు కమిషనర్ పంకజ కమిషనర్ ఇలంబర్తికి నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా నేడు కమిషనర్ నిర్ణయం తీసుకునే అవకాశమున్నది. లంగర్‌హౌజ్ పార్కు లేక్‌లో గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియలో భాగంగా మిషన్లతో పనులు జరపాల్సిన చోట కార్మికులతో పనిచేయించడం, చెరువులో పడి ఇద్దరు తండ్రీ కొడుకులు చనిపోయారు. పనుల పర్యవేక్షణలో సూపర్‌వైజర్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్‌ల నిర్లక్ష్యం ఉందని, మిషిన్లతో జరపాల్సిన పనులను కార్మికులతో జరిపించడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విభాగంలోనే సెలవు రోజుల్లోనూ జీతాలను తీసుకుంటూ.. సంస్థ ఖజానాకు గండి కొట్టిన విషయాన్ని 'నమస్తే' వెలుగులోకి తీసుకొచ్చిన కథనంపై కమిషనర్ స్పందించారు.కంప్యూటర్ ఆపరేటర్ సంతోష్‌పై వేటు వేశారు. దీనిపై సమగ్ర విచారణ జరుగుతుందని, నివేదిక ఆధారంగా మరిన్ని చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

# మంటలంటుకొని..కారులో సిలిండర్ పేలి

మొత్తం మూడు సిలిండర్లు పేలి..

చిన్నారి సహా ఇద్దరు మహిళలు మృతి



మణికొండ: మణికొండ మున్సిపాలిటీలోని పాషాకాలనీలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది.ఈ క్రమంలో సిలిండర్లు పేలి చిన్నారితో పాటు ముగ్గురు చనిపోయారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. నార్సింగి పీఎస్ పరిధిలోని పుప్పాలగూడ పాషాకాలనీలో నివాసముంటున్న జమీలా కాతూన్ (70) తన 15 మంది కుటుంబ సభ్యులతో కలిసి రెండంతస్తుల భవనంలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం కొందరు బయటకు వెళ్లగా గ్రౌండ్ ఫ్లోర్లోని కిరాణాషాప్ లో అనుకోకుండా మంటలు వచ్చాయి. స్థానికులు వెంటనే అక్కడి నుంచి పరుగెత్తడంతో పక్కనే ఉన్న కారుకు మంటలంటుకుని అందులోని సిలిండర్ పేలి మొదటి అంతస్తులోని ఇంటికి మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఇంట్లోని మరో రెండు సిలిండర్లు పేలాయి. అప్పటికే ఇంట్లో ఉన్న జమీలా కాతూన్(70), తహనా కాతూన్(38), సిఫ్రా కాతూన్(4) మంటలలో చిక్కుకుని సజీవ దహనమయ్యారు. ఇంట్లోని మరో ఎనిమిది మంది మంటలను చూసి భయపడి రెండో అంతస్తులోకి పరుగెత్తి అరుపులు.. కేకలు వేయడంతో ఎగిసిపడుతున్న మంటలను చూసిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి అగ్నికి ఆహుతి కావడంతోపాటు మూడు సిలిండర్లు, రెండు కార్లు కాలి బూడిదయ్యాయి. రెండో అంతస్తులో ఉన్న యూనిస్ ఖాన్ ప్రాణం రక్షించుకునే క్రమంలో ఆ అంతస్తు నుంచి కిందకు దూకారు. దీంతో అతడి కాలు విరిగింది. నార్సింగి పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీసి గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తున్నారు. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరుపై వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.





గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం నేషనల్ సైన్స్ డే సందర్భంగా డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు హాజరైన విద్యార్థులు, యువతీయువకులు